క్లుప్తంగా

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి



పొన్నూరు: ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మండల ప్రత్యేక అధికారి ఓ.నరసింహారావు అన్నారు. శనివారం మండలంలోని ములుకుదురు, మాచవరం, చింతలపూడి గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. తొలుత పలువురు పింఛన్‌దారులకు పింఛన్‌ను అందజేశారు. ఆయనతో పాటు ఈఓపీఆర్‌డీ మల్లికార్జునరావు పాల్గొని ఇంటింటికీ వెళ్లి తడి చెత్త, పొడి చెత్త విభజన చేసి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని తెలిపారు. స్వచ్ఛత కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందజేశారు. ప్రధాన కూడళ్లలో పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ప్రొక్లెయిన్‌తో ప్రధాన వీధుల్లో చెత్తను తొలగించారు. కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.

విశ్వంజీ జన్మదిన వేడుకలు ప్రారంభం



ప్రత్తిపాడు: విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ 81వ జన్మదిన వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధి చిన కోండ్రుపాడు విశ్వనగర్ లోని ఆలయాల్లో శనివారం ఉదయం విశ్వంజీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య కల్పవృక్ష వరసిద్ధి వినాయకుడికి 108 కలశాలతో అభిషేకం చేశారు. అనంతరం విశ్వమానవ సమైక్యతా సంసత్ కన్వీనర్ ఆకుల కోటేశ్వరరావు, కామేశ్వరి దంపతులతో విశ్వంజీ పూజలు చేయించారు. విఘ్నేశ్వరునికి దివ్యహార తులిచ్చి మహా నైవేద్యం సమర్పించారు. సాయంత్రం కోలాట బృందం చేసిన కోలాట ప్రదర్శన అలరించింది. ఈ సందర్భంగా విశ్వంజీ మాట్లాడుతూ విశ్వ శాంతి కోసం ఆశ్రమంలో ప్రత్యేక హోమాలు, యాగాలు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. విశ్వమంతా శాంతి సౌభ్రాతృత్వాలతో విరాజిల్లాలని ఆకాంక్షించారు.

బైక్‌లు నడిపే వారు తప్పక హెల్మెట్ ధరించాలి

పెదకాకాని: బైక్‌లు నడిపేవారందరూ తప్పక హెల్మెట్ ధరించాలని పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి శనివారం కోరారు. వాహనాలు నడిపే సమయంలో హెల్మెట్ లేనట్టయితే ఒక్కొక్కరికి వెయ్యి రూపాయలు జరిమానా విధించడం జరుగుతుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా ముందు వెనక కూర్చున్న వారు హెల్మెట్ ధరించాలన్నారు. కారు నడిపే వారు సీటు బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలని కోరారు. రోజు ఏదో ఒక చోట రోడ్డు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ వాహనం నడపాలని, కచ్చితంగా హెల్మెట్ ధరించాలని పేర్కొన్నారు. ముఖ్యంగా వాహనాలు నడిపే వారు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తున్నారని తద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని హెచ్చరించారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ వీరభద్రాచారికి పీహెచ్‌డీ



చేబ్రోలు: మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ గాదె వీరభద్రాచారికి పీహెచ్‌డీ పట్టా అందజేసినట్లు వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ శనివారం తెలిపారు. 'డెవలప్‌మెంట్ ఆఫ్ లీస్ట్ స్క్వేర్స్ రెగ్రేషన్ బేస్డ్ ఏఎల్‌వో టెక్నిక్ ఫర్ ద బెస్ట్ ఆప్టిమల్ సొల్యూషన్ ఆఫ్ ఓఆర్‌పీడీ అండ్ ఈఎల్‌డీ ప్రాబ్లమ్స్ ఇన్ పవర్ సిస్టమ్స్' అనే అంశంపై వీరభద్రాచారి పరిశోధన చేశారని వివరించారు. పరిశోధనలో భాగంగా మొత్తం ఎస్‌సీఐ-2, స్కోపస్ జర్నల్స్-1, ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లు 2 ప్రచురించారని తెలిపారు. పీహెచ్‌డీ పొందిన వీరభద్రాచారిని పలువురు అభినందించారు.

కంది సాగులో సస్య రక్షణ

చేబ్రోలు: కంది సాగులో రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించటం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని లాం ఫాం ఏరువాక కేంద్రం సమన్వయకర్త ఎస్.వెంకట లక్ష్మి అన్నారు. చేబ్రోలు మండలం నారాకోడూరులో శనివారం కంది పొలాలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలను అందజేశారు. ఈ సందర్భంగా వెంకట లక్ష్మి మాట్లాడుతూ కంది సాగులో కాయ దశలో తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. పురుగు, తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవన సహాయకులు జి.శివసత్యం బాబు, శ్రీహరి పాల్గొన్నారు.

పశువులకు టీకాతో ఆరోగ్యం

- ప్రబలుతున్న గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధులు
- నియంత్రించేందుకు ఉచితంగా టీకాలు
- శనివారం నుంచి 30 వరకు టీకాల కార్యక్రమం
- సకాలంలో టీకాలు వేయించాలంటున్న పశుసంవర్ధక శాఖ అధికారులు



ప్రత్తిపాడులో పశువులకు ఉచితంగా టీకాలు వేస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది

ప్రత్తిపాడు: మనుషులకు ప్రాణాంతక రోగాలు సోకినట్లే.. పశువులకూ రోగాలు ప్రబలుతుంటాయి. ఆ రోగాన్ని ముందుగానే గుర్తించి చికిత్స చేయించకపోయినా, నియంత్రించకపోయినా పశువులు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. అందుచేత పాడి రైతులు, పశు పోషకులు మూగజీవాలకు సోకే ప్రాణాంతక వ్యాధులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలి. మూగజీవాలు ప్రాణాంతక వ్యాధుల బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలి. సకాలంలో టీకాలు వేయించి మూగజీవాల ప్రాణాలను కాపాడుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారులు సూచిస్తున్నారు.

మార్చి 31 వరకు..

జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మార్చి ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా పశువులకు టీకాలు వేస్తున్నారు. పశువులకు ప్రాణాంతకమైన గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వంటి వ్యాధులు సోకకుండా ముందుగానే పశు పోషకుల ఇంటి వద్దనే టీకాలు వేస్తున్నారు. ఇందుకోసం గ్రామాల వారీగా ఉన్న మూగజీవాల వివరాలను సేకరించి, ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసి వెటర్నరీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి టీకాలు వేయనున్నారు. 2019 పశుగణన ప్రకారం ప్రత్తిపాడు, గుంటూరురూరల్ మండలాల్లో గేదెలు 17,346, ఆవులు, ఎద్దులు 1,936, మేకలు, గొర్రెలు 16,504 వరకు ఉన్నాయి.

గాలికుంటు వ్యాధితో అనర్థాలు..

గాలికుంటు వ్యాధి బారిన పడిన పశువుల్లో తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుండి తీగల్లా చొంగ, నోరు, కాలి గిట్టల మధ్య పుండ్లు, రొప్పడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అదేవిధంగా పాల ఉత్పత్తి, పని సామర్థ్యం గణనీయంగా తగ్గిపోవడం, పాలు తాగే దూడల్లో మరణాలు, వైద్యం నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోవడం వంటి నష్టాలు ఉంటాయి. అందుచేత నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకూ కచ్చితంగా టీకా వేయించాలి.

చికిత్సనే లేని 'బ్రూసెల్లోసిస్'..

నివారణ తప్ప, చికిత్స లేని వ్యాధి బ్రూసెల్లోసిస్. దీనిని నివారించేందుకు ఉన్న ఒకే ఒక్క మార్గం టీకా. ఈ వ్యాధి సోకిన పశువుల్లో జ్వరం, బలహీనత, చూడి ఆఖరి దశలో గర్భస్రావం, గర్భస్రావ మట్టు, మాయ వేయకపోవడం, చూడి నిలవకపోవడం, మగ పశువుల్లో వృషణాల వాపులు, కీళ్ల వాపు, వంధత్వం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఈ వ్యాధి సోకిన పశువుల గర్భస్రావాలు, మాయా, పాల ద్వారా ఇతర జంతువులకు వ్యాపిస్తుంది. వ్యాధి సోకిన పశువుల నుంచి మనుషులకూ సోకుతుంది. వ్యాధిని నియంత్రించేందుకు మూడు విడతలుగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి. 4-8 నెలల వయస్సు ఉన్న పెయ్య దూడలకు తప్పనిసరిగా టీకాలు వేయాలి. పాలను ఎప్పుడూ మరిగించి వినియోగించుకోవాలి. వ్యాధిగ్రస్త పశువు మిగిల్చిన మేత, గర్భస్రావ మట్టు, మాయ, పిండాలను గొయ్యి తీసి పూడ్చిపెట్టాలి.

ప్రతి పశువుకూ వ్యాక్సిన్



జాతీయ పశు వ్యాధి నివారణ పథకంలో భాగంగా ప్రతి పశువుకూ పాడి రైతు ఇంటి వద్దకే వెళ్లి వ్యాక్సినేషన్ చేయనున్నాం. పశు పోషకులు పశుసంవర్ధక శాఖ సిబ్బందికి సహకరించాలి. గాలికుంటుతో పాటు బ్రూసెల్లోసిస్ వ్యాధులు ప్రమాదకరమైనవి. రైతులు అప్రతమత్తంగా ఉండాలి.

– కె.శ్రీనివాసరెడ్డి, ఏడీ, పశుసంవర్ధక శాఖ, ప్రత్తిపాడు

వివా ఐబీ విద్యార్థుల పీవైపీ ఎక్స్‌పో



నంబూరు వివా ది స్కూల్‌లో జరిగిన ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్‌లో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: వివా ది స్కూల్‌లో ఇంటర్నేషనల్ బాకలారియేట్ ఏవైపి (ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్) శనివారం నిర్వహించారు. ఐదో తరగతి విద్యార్థులు తరగతి గదిలో అభ్యసించిన అంశాలపై అవగాహన, సృజనాత్మకత, నైపుణ్యాలను ప్రదర్శించేందుకు ఏర్పాటు చేసిన ప్రైమరీ ఇయర్స్ ప్రోగ్రామ్ ఎక్సోస్ప(పి.వై.పి.ఎక్స్‌పో) విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఐబీ విద్యా విధానం ద్వారా వారు అభ్యసించిన విద్యా, విద్యేతర అంశాలలో ప్రావీణ్యం సాధించిన నైపుణ్యాలను తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో ప్రదర్శించారు. షేరింగ్ ది ప్లానెట్ ' అంటూ ఉపాధ్యాయులు అందించిన నేపథ్య అంశంపై విద్యార్థులు వాతావరణ చర్య, నీటి సంరక్షణ, జంతు సంరక్షణ, ఆహారం- ఆకలి వంటి అంశాలపై రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఇటీవల కాలంలో విద్యార్థులు సందర్శించిన పర్యాటక ప్రాంతాలు, వాటి విశిష్టతను తెలియజేస్తు రాసిన వ్యాసాలు, ఫొటోలు ఈ ప్రదర్శనలో ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని సందర్శించిన తల్లిదండ్రులు విద్యార్థుల ప్రగతిని వీక్షించారు. అనంతరం ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులను చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎలిటి కమాండర్ కేఎస్ రావు, ప్రిన్సిపాల్ సిహెచ్.సరళ, ఐబీ సమన్వయకర్త కె.మాధవి పాల్గొన్నారు.

కరాటేలో సెయింట్ థామస్ విద్యార్థుల ప్రతిభ



పొన్నూరు: పట్టణంలోని సెయింట్ థామస్ కేరళ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు చిలకలూరిపేటలో నిర్వహించిన ఆల్ ఇండియా కరాటే-డో చాంపియన్ షిప్ 2025లో తమ ప్రతిభ పురస్కారాలు పొందారు. సౌమ్య మొదటి బహుమతి సాధించి చాంపియన్ ట్రోఫీ దక్కించుకుంది. లిలి శరణ్య రెండో బహుమతి సాధించి రన్నర్ అప్ అవార్డు, ప్రియాంక, ఫర్హాన్, రయాన్, జాహ్నవి మూడో బహుమతి సాధించి అచీవ్‌మెంట్ ట్రోఫీలను దక్కించుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ ప్రధానోపాధ్యాయిని రోజ్ థామస్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. విజేతలతో పాటు కరాటే శిక్షకులు ఉమా మహేశ్వరరావును అభినందించారు.

ఆర్‌వీఆర్‌జేసీలో శాస్త్ర విజ్ఞానంపై సదస్సు



గుంటూరు రూరల్: పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు శాస్త్ర విజ్ఞాన అధ్యాయన ఆలోచనలకు అంకురార్పణ జరగాలని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని పేర్కొన్నారు. రెండు రోజులుగా చౌడవరం గ్రామంలోని కళాశాలలో జరుగుతున్న జాతీయ సైన్స్‌డే వేడుకలు శనివారంతో ముగిశాయి. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రోగులకు బియ్యం పంపిణీ

గుంటూరు మెడికల్: జీజీహెచ్ అత్యవసర వైద్యసేవల విభాగం వద్ద పేషంట్ డాక్టర్ ఇంట్రాక్షన్ అనే కార్యక్రమం సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ గతవారం ప్రారంభించారు. అందులో భాగంగా శనివారం రోగులు, వారి సహాయకుల సమస్యలు తెలుసుకుని వాటిని అక్కడే పరిష్కరించారు. షాపర్ స్టాఫ్ సౌజన్యంతో రోగులు, వారి సహాయకులకు బియ్యం పంపిణీ చేశారు.

తాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూ నగర్: నగరంలో వేసవిని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సరఫరాకి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం బీఆర్ స్టేడియం రిజర్వాయర్ పైప్‌లైన్ లీకు మరమ్మతులు, డొంక రోడ్‌లోని మూడు వంతెనల వద్ద పనులు, నగరంలో పింఛన్ పంపిణీ, అమరావతి రోడ్ ఐడీ హాస్పిటల్ వద్ద అన్న క్యాంటీన్‌ని శనివారం పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ బీఆర్ స్టేడియం రిజర్వాయర్ వద్ద పైప్ లైన్ లీకు మరమ్మతులు శనివారం నాటికి పూర్తి చేసి ఆదివారం ఉదయం నుంచి సరఫరా జరిగేలా ఇంజినీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షణ చేయాలని కోరారు. మూడు వంతెనల దగ్గర జరుగుతున్న పనులను పరిశీలించి, రైల్ పేట నుంచి వచ్చే డ్రెయిన్ నీటిని నేరుగా మేజర్ డ్రెయిన్‌లోకి కలిపేలా నూతన కల్వర్ట్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. పర్యటనలో ఈఈ సుందర్‌రామిరెడ్డి, డీఈఈలు నాగభూషణం, కళ్యాణరావు, ఏసీపీ మల్లికార్జున, ఆర్ఓ రవికిరణ్ రెడ్డి, ఎస్ఎస్ ఆయూబ్ ఖాన్, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణ రెడ్డి పాల్గొన్నారు.

కారు ఢీకొని ఎంబీబీఎస్ విద్యార్థిని మృతి



తాజ్‌అఫ్షా మృతదేహం

నందిగామ రూరల్: ఇబ్రహీంపట్నం (మైలవరం): రెండు నిమిషాల్లో కళాశాలకు చేరాల్సిన వైద్య విద్యార్థినిని రోడ్డు ప్రమాదం కారు రూపంలో బలితీసుకుంది. మరో విద్యార్థిని తీవ్రంగా గాయపడింది. ఇబ్రహీంపట్నం మండలం జూపూడి వద్ద నిమ్రా వైద్యకళాశాల సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గుంటూరు శ్యామలానగర్‌కు చెందిన సయ్యద్ తాజ్ అఫ్షా (20), చిత్తూరు టౌన్ దుర్గాకాలనీకి చెందిన అలేజ్ అహ్మద్ జూపూడిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అద్దెకుంటూ స్థానిక నిమ్రా వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదువుతున్నారు. ఉదయం కళాశాలకు స్కూటీపై వెళ్తుండగా హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎంబీబీఎస్ మూడో సంవత్సరం చదువుతున్న తాజ్ అఫ్షా(20) తీవ్రంగా గాయపడి ఘటనా స్థలంలోనే మృతి చెందింది. ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం చదువుతున్న అలేజ్ అహ్మద్ తీవ్రంగా గాయపడింది. ఆమెను తొలుత సమీపంలో నిమ్రా వైద్యశాలకు, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతి చెందిన తాజ్ అఫ్షా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విజయవాడ ఏడీసీపీ జి.రామకృష్ణ, ఏసీపీ దుర్గారావు, సీపీ చంద్రశేఖర్ ఘటనా స్థలాన్ని సందర్శించి, ప్రమాదంపై ఆరా తీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కూలీ రేట్ల జీఓ విడుదల

లక్ష్మీపురం: సివిల్ సప్లయీస్ హమాలీ(ముఠా) కూలీరేట్ల పెంపు జీఓ నంబర్ 14 జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా) వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చల్లాచిన్న ఆంజనేయులు అన్నారు. ఏఐటీయూసీ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం గుంటూరు నగర ముఠా కార్మిక సంఘం కార్యాలయం రేగుల రాఘవయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లయీస్ కార్పొరేషన్‌లో రాష్ట్రవ్యాప్తంగా మండల లెవెల్ స్టాక్ పాయింట్లలో పనిచేస్తున్న సుమారు ఐదువేల మంది ముఠా కార్మికులకు వివిధ అంశాలకు పెంచిన రేట్లు గత ఒప్పందం కంటే ప్రస్తుత ఒప్పందం ద్వారా రూ.11.80 కోట్లు అదనంగా కార్మికులకు అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం శనివారం జీఓ జారీ చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.సురేష్ బాబు, రాష్ట్ర ఉపప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు, జిల్లా అధ్యక్షులు కోట్ల మరియదాసు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సీఐ ఎ.అశోక్

పట్నంబజారు: మార్చి ఒకటి నుంచి మోటారు వెహికల్ యాక్ట్ అమలు దృష్ట్యా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్ కుమార్ తెలిపారు. శనివారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఈస్ట్ ట్రాఫిక్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండు నెలలుగా నూతన చట్టాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కలిగేలా పూర్తి స్థాయిలో అవగాహన సదస్సు నిర్వహించడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మార్చి ఒకటి నుంచి మోటారు వెహికల్ చట్టం ఉల్లంఘనకు సంబంధించి నూతన అపరాధ రుసుం సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ అయినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వారి డాక్యుమెంట్లు దగ్గర పెట్టుకోవాలని, హెల్మెట్ తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. వాహనదారులు నిబంధనలు పాటించకపోతే భారీ జరిమానాలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు.

ఆడపిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దాలి

ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు సీడీపీఓ సుజాతదేవి



ఆడపిల్లల తల్లులకు మొక్కలు పంపిణీ చేస్తున్న సీడీపీఓ సుజాతదేవి, ఏసీడీపీఓ విజయనిర్మల

ప్రత్తిపాడు: తల్లిదండ్రులు ఆడపిల్లల భవిష్యత్తును ఉజ్వలంగా తీర్చిదిద్దాలని ఐసీడీఎస్ ప్రత్తిపాడు ప్రాజెక్టు సీడీపీఓ వి.సుజాతదేవి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాలలో భాగంగా శనివారం మండల పరిధిలోని కోయవారిపాలెంలో ఆడపిల్లల జననాల వేడుకతో పాటు ఆడబిడ్డల పేరుతో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన సీడీపీఓ సుజాతదేవి ఆడపిల్లల తల్లులకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడపిల్ల పుట్టిన వెంటనే ఒక మొక్కను నాటి, సంరక్షించాలన్నారు. ఆ మొక్క పెరిగి నీడనివ్వడంతో పాటు మంచి ఫలాలనిస్తాయని, అదే విధంగా ఆడ పిల్లను కూడా మంచిగా చదివించి ఉజ్వలంగా తీర్చిదిద్దేతే కుటుంబంతో పాటు సమాజం బాగుపడుతుందన్నారు. అడిషనల్ సీడీపీఓ విజయనిర్మల మాట్లాడుతూ ఆడపిల్లల సంరక్షణకు ఎన్నో చట్టాలున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్లు పి.మాధవి, ఎస్.భారతి పాల్గొన్నారు.

చిప్స్‌లో అంతర్ ఫార్మసీ కళాశాలల క్రీడాపోటీలు



వివిధ క్రీడా పోటీలలో విజేతలతో కళాశాల ప్రతినిధులు

గుంటూరు రూరల్: చౌడవరంలోని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాలలో జాతీయ విజ్ఞాన దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో అంతర్ ఫార్మసీ కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించారు. రెండు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడాపోటీలు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ మాట్లాడుతూ పోటీలలో భాగంగా విద్యార్థులకు ఫార్మాక్విజ్, కాంపౌండింగ్, డిస్పెన్సింగ్, కేస్ ప్రజంటేషన్, కబడ్డీ, వాలీబాల్, త్రోబాల్, షాట్‌పుట్, రన్నింగ్, పోటీలను నిర్వహించటం జరిగిందన్నారు. పోటీలకు రాష్ట్ర స్థాయిలో 600 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. కిట్ ఇంజినీరింగ్ కళాశాల కోయి సుబ్బారావు, ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి ఆధునిక ప్రపంచంలో సైన్స్ విభాగం మన దేశాన్ని ఉన్నత శిఖరాలను చేర్చిందన్నారు. పోటీలలో చిప్స్ కళాశాల విద్యార్థులు వాలీబాల్‌లో ప్రథమ స్థానం, త్రోబాల్‌లో ద్వితీయ స్థానం, కబడ్డీలో ద్వితీయ స్థానం, హిందూ ఫార్మసీ కళాశాల వాలీబాల్‌లో ద్వితీయ స్థానం, ఏఎం రెడ్డి కళాశాల కబడ్డీలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. కార్యక్రమంలో విజేతలను ప్రోగ్రాం కన్వీనర్ డాక్టర్ జె.సుబ్బారావు, కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, సభ్యుడు పీ గోపిచంద్ అభినందించారు.

శంకర కంటి ఆస్పత్రి సేవలు ప్రశంసనీయం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మాదల రత్నగిరిబాబు

పెదకాకాని: శంకర కంటి ఆస్పత్రిలో అందిస్తున్న కంటి వైద్య సేవలు ప్రశంసనీయమని చీఫ్ పాటరన్ మాదాల రత్నగిరి బాబు అన్నారు. పెదకాకాని గ్రామంలో శ్రీ కంచి కామకోటి మెడికల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శంకర కంటి ఆస్పత్రి వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ఆస్పత్రి ముఖ్య వైద్యాధికారి సుధాకర్ పొట్టి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ మాదాల రత్నగిరి బాబు మాట్లాడుతూ శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామి వారి కోరిక మేరకు పెదకాకాని గ్రామంలో 4.5 ఎకరాలు స్థలం శంకర కంటి ఆస్పత్రి నిర్మాణానికి విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామీణ పేద ప్రజలకు సేవ భావంతో కంటి చూపు ప్రసాదిస్తున్న ఆసుపత్రి సేవలను కొనియాడారు. క్వాలిటీ అండ్ ట్రైనింగ్ . మెడికల్ అడ్మినిస్ట్రేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ కౌశిక్ మురళి మాట్లాడుతూ శంకర కంటి ఆసుపత్రి రోజుకు ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ కంటి వైద్య సేవలో ప్రథమ స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. అనంతరం ఆస్పత్రిలో 20 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న ముగ్గురికి, 15 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న 8 మందికి, 10 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న నలుగురికి, ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న 10 మందికి అతిదుల చేతుల మీదుగా లాంగ్ సర్వీస్ అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో యూనిట్ హెడ్స్ త్రిపుర, మాధవి పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థులకు సేంద్రియ పాఠాలు



సేంద్రియ వ్యవసాయంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సేంద్రియ రైతులు

గుంటూరు రూరల్: వ్యవసాయంపై విద్యార్థులకు చిన్ననాటినుంచి అవగాహన అవసరమని రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై వెంకటేశ్వరరావు తెలిపారు. శనివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంట నందున్న రైతునేస్తం ఫౌండేషన్‌లో విద్యార్థులకు సేంద్రియ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైతులు తమ పంటల సాగులో విచక్షణారహితంగా రసాయనాలు ఉపయోగించడానికి అలవాటు పడ్డారన్నారు. కారణాలు ఏమైనా కాని విచక్షణా రహిత రసాయనాల వినియోగం వలన నేల, నీరు, ఆహారం వాతావరణం కలుషితమవ్వడంలో రసాయనిక వ్యవసాయం తన వంత పాత్రను పోషిస్తుందని చెప్పారు. సేంద్రియ రైతు మీసాల రామకృష్ణ మాట్లాడారు. విజ్ఞాన్ ఫౌండేషన్ ఫర్ సైన్స్ టెక్నాలజీ అండ్ రిసెర్చ్ కాలేజీ విద్యార్థులకు సేంద్రియ సాగు విలువ జోడింపుపై అవగాహన కల్పించటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్ విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ డాక్టర్ సుస్మిత, డాక్టర్ అరుణకుమారి, యూసఫ్, ఉమామహేశ్వరి, అమృతవర్షిణి, రైతునేస్తం ఫౌండేషన్ సీఈఓ సాంబశివరావు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలను జాతి మరువదు

ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ తోడేటి ఏసుపాదం

ప్రత్తిపాడు: ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో ఎస్సీ వర్గీకరణ కోసం వీరమరణం పొందిన అమరవీరులను మాదిగ జాతి ఎప్పటికీ మరిచిపోదని సంఘం నియోజకవర్గ కన్వీనర్ తోడేటి ఏసుపాదం అన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ పిలుపు మేరకు మండల పరిధిలోని యనమదలలో శనివారం మాదిగ అమరవీరుల సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. పాలెపు శివయ్య మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఏసుపాదం అమరవీరుల ఫ్లెక్సీ వద్ద జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు తోడేటి కృపారావు మాదిగ, తోడేటి ప్రభుదాస్ మాదిగ, గొడ్డుగోరు చిన్నబ్బాయి మాదిగ, తోడేటి జగదీష్ మాదిగ, తోడేటి బుల్లి మాదిగ, మన్నవ సురేష్ మాదిగ పాల్గొన్నారు.

14న గిరిప్రదక్షిణకు ప్రత్యేక ఆర్టీసీ సర్వీసులు

పట్నంబజారు: అరుణాచల పుణ్యక్షేత్రంలో పౌర్ణమి సందర్భంగా నిర్వహించనున్న గిరి ప్రదక్షిణకు ఈనెల 14న ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్‌ఆర్టీసీ ఆర్‌ఎం ఎం.రవికాంత్ శనివారం తెలిపారు. ఈనెల 12 రాత్రి బస్సు బయల్దేరుతుందని, 13వ తేదీ ఉదయం కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శించుకున్న అనంతరం ఆదేరోజు రాత్రి అరుణాచలం చేరుకుంటుందన్నారు. భక్తులు గిరిప్రదక్షిణ చేసుకుని స్వామి దర్శనం అనంతరం తిరిగి 15వ తేదీ ఉదయం గుంటూరు చేరుకుంటుందన్నారు. ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవాలనుకునే వారు 96164 సర్వీసు నంబరులో రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. టికెట్టు ధర రూ.2,420 నిర్ణయించినట్లు తెలిపారు. వివరాలకు 7382877459, 7382896403 నంబరులో సంప్రదించాలని కోరారు.